క్లుప్తంగా

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



సిరాజుద్దీన్ సోదరుడి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

చేజర్ల: మండలంలోని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత షేక్ సిరాజుద్దీన్ సోదరుడు వివాహ వేడుకలకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. చేజర్లలో జరిగిన సిరాజుద్దీన్ సోదరుడు షేక్ లతీఫ్‌అహ్మద్ వివాహ హల్దీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలపై వినతులు



పెద్దిరెడ్డిపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌ఐ సాయికిరణ్

వరికుంటపాడు: మండలంలోని జి.కొండారెడ్డిపల్లి, గువ్వాడి, పెద్దిరెడ్డిపల్లి, కాంచెర్వు, టి.చెన్నంపల్లి, తోటలచెరువుపల్లి, తదితర గ్రామాల్లో బుధవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్జీలకు పరిష్కారం చూపుతామని రెవెన్యూ అధికారులు తెలిపారు. తోటలచెరువుపల్లిలో జరిగిన రెవెన్యూ సభలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్.మల్లికార్జున, పెద్దిరెడ్డిపల్లి సభలో ఆర్‌ఐ సాయికిరణ్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులరెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి నూతన తహసీల్దార్‌గా సానా శ్రీనివాసులరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వి.జగదీష్‌బాబు వరికుంటపాడుకు బదిలీ అయ్యారు. తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేశానని, సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి కలీం ఎంపిక



కలీం

ఉదయగిరి: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందుకూరు ప్రభాకర్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేసే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సయ్యద్ తాహెర్‌అలి హుస్సేని (కలీం) ఎంపికయ్యారు. ఆయన గురువారం నెల్లూరులోని టౌన్‌హాలు ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కలీంను పలువురు సహచర ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శ



వెంకటేశ్వర్లు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చేజర్ల: చేజర్ల మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆత్మకూరు గణేష్ తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందాడు. ఆయన ఉత్తరక్రియలకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. వెంకటేశ్వర్లు చిత్ర పటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధ్యతగా పనిచేయాలి

వరికుంటపాడు: మండలంలోని ఉపాధి హామీ పథక సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి, ఏపీఓ వి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగి ఉండి అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. కూలీలకు కొలతల ప్రకారం పనులు కేటాయించాన్నారు. పని ప్రదేశంలోనే హాజరు నమోదు చేయాలన్నారు. కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా సమీక్షించారు.

ప్రతి కుటుంబానికి జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్య పరీక్షలు చేయించుకున్న వృద్ధుడికి జగనన్న ఆరోగ్య సురక్ష పుస్తకాన్ని అందజేస్తున్న ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు



చేజర్ల: నాగులవెలటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్లు అందజేస్తున్న ఎంపీపీ తూమాటి



అనంతసాగరం మండలం బొమ్మవరంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు, వైద్యులు, నాయకులు

- ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు

కావలి: వైద్యం కోసం పేదల నుంచి పెద్దల వరకు ఎవరూ ఇబ్బంది పడకుండా వారి ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు తెలిపారు. దగదర్తి మండలం తడకలూరులో బుధవారం ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి, మందులు, ఉచిత కళ్ల జోళ్లు ఇచ్చి వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్నా వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రజల చెంతకే ఏఎన్‌ఎం నుంచి స్పెషలిస్ట్ డాక్టర్ల వరకు మన ఇంటి వద్దకే తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనం రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆత్మకూరు గిరి నాయుడు, వైద్యులు, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరం

చేజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమని ప్రజాప్రతినిధులు,అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని నాగులవెలటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. 230 మంది వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వేలూరు తిరుపతినాయుడు. జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, వైద్యులు ఎస్.జ్యోతి, పవన్‌కుమార్‌రెడ్డి, నవీన్ మాధురి, ఐశ్వర్య, ఈఓపీఆర్డీ రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర నాయుడు, ఓబయ్య నాయుడు, రామసుబ్బారెడ్డి, సెక్రటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో..

మండలంలోని బొమ్మవరం సచివాలయ పరిధి అగ్రహారంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. 336 మందికి వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యాల సంపూర్ణమ్మ, మండల జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఎంపీటీసీ సభ్యులు కొండారెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ మధుసూదనరావు, వైద్యులు సి నాగేంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, అవినాష్, సాయిశ్వేత, వరలక్ష్మి పాల్గొన్నారు.

అందరికీ వైద్యం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

ఆత్మకూరురూరల్: పేద, ధనిక తారతమ్యం లేకుండా పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి అన్నారు. మండలంలోని అప్పారావుపాళెంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలు అందరికీ సంపూర్ణ వైద్యం అందించేందుకు కుటుంబాల వారీగా ముందుగానే ఆరోగ్య సర్వే నిర్వహించి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమం నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థ ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏఓ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేణమ్మ, బట్టేపాడు సొసైటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, మాజీ చైర్మన్ వాసిపల్లి లక్ష్మిరెడ్డి, సచివాలయ కన్వీనర్ హజరత్ నాయుడు, సచివాలయ, ఆరోగ్యశాఖ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం మ్యాపింగ్

కలిగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబాన్ని మ్యాపింగ్ చేసి, ఏ ఇంట్లో ఎలాంటి అనారోగ్య బాధితులు ఉన్నారో.. గుర్తించడం, వారికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జెడ్పీటీసీ జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, ఎంపీపీ మెట్టుకూరు శిరీష అన్నారు. మండలంలోని చిన్నఅన్నలూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 367 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 90 మంది రోగులను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యంకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, సర్పంచులు రాగి కుమారి, పందిళ్లపల్లి ధనమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నేలపాటి దొరసానమ్మ పాల్గొన్నారు.



అప్పారావుపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



కలిగిరి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మాల్యాద్రిరెడ్డి

ముగ్గురు వైద్యులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

వైద్య శిబిరంలో రోగులు ఉన్నప్పటికి మధ్యాహ్నం 3.30 గంటలకే వైద్యశిబిరం నుంచి వెళ్లిపోయిన ముగ్గురు వైద్యులపై ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు నుంచి వచ్చిన వైద్యులు సునీల్, లక్ష్మీమోనిక, కరీష్మా నిర్ణత సమయం వరకు వైద్యశిబిరంలో విధులు నిర్వర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహించారన్నారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష మెగా క్యాంప్

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెగా క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంగళరావునగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ రమ్య సారథ్యంలోని వైద్య బృందం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో కలిసితో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా క్యాంప్‌పై చర్చించారు. పేదలు ఎక్కువ ఉన్న ప్రాంతం కావడంతో ప్రజలు వేల సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే చెప్పారు. అదనపు వైద్యులను, సిబ్బందిని, వలంటీర్లను సమకూర్చుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ క్యాంప్‌లో ముసునూరు, బుడమగుంట, బాలకృష్ణారెడ్డినగర్, వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్, జనతాపేట సౌత్ తదితర ప్రాంతాల ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యులు ఉచిత వైద్య సేవలు, మందులు అందజేస్తారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి బీపీ చెక్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఎమ్మెల్యే పాల్గొనడంతో వలంటీర్ ఎమ్మెల్యే నుంచి బయోమెట్రిక్ తెలిపారు.



బీపీ చెకప్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బీసీ హాస్టళ్లలో విద్యార్థుల అడ్మిషన్లకు ఆమోదం

కావలి: పట్టణంలోని ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో విద్యార్థిని, విద్యార్థులకు ప్రవేశాలకు ప్రభుత్వ హాస్టళ్ల సలహా మండలి చైర్మన్, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆమోదం తెలిపారు. బుధవారం తన నివాసంలో బీసీ హాస్టళ్ల వార్డెన్లు, వెల్ఫేర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో బీసీ బాలుర హాస్టల్–1లో 64 మంది, బీసీ బాలుర హాస్టల్–2 లో 58 మంది, బీసీ కళాశాల విద్యార్థుల హాస్టల్‌లో 61 మంది, బీసీ బాలికల హాస్టల్‌లో 89 మంది, బీసీ కళాశాల విద్యార్థినుల హాస్టల్‌లో 27 మందికి అడ్మిషన్లకు అంగీకరించారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలి పట్టణంలో ఐదు బీసీ హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో బీసీ కేటగిరీతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థిని విద్యార్థులకు ప్రవేశాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు హాస్టళ్లలో ప్రవేశాలు పొందని వారు ఉంటే.. ఇంకా కూడా హాస్టళ్లలో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. కావలి బీసీ సహాయ సంక్షేమశాఖ అధికారి సుధాకర్, హాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.



బీసీ హాస్టళ్ల అధికారులతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): జిల్లాలోని గ్రంథాలయ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార రాజా అన్నారు. మర్రిపాడులోని శాఖా గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యావంతులు ప్రతి ఒక్కరు గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. 2022–23 సంవత్సరంలో మర్రిపాడు గ్రంథాలయానికి 890 కొత్త పుస్తకాలు సరఫరా చేశామన్నారు. విద్యార్థుల కోసం ముందుగా తెలియజేసిన ప్రకారం అవసరమైన పుస్తకాలు, విద్యా సామగ్రి సరఫరా చేస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు గ్రంథాలయ సెస్సును సక్రమంగా చెల్లించి సంస్థ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఆయన వెంట మర్రిపాడు ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి నారాయణరావు, కదిరినేనిపల్లి గ్రంథాలయ నిర్వాహకులు ప్రభావతి పాల్గొన్నారు.



మర్రిపాడు శాఖా గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి కుమార రాజా

వెనామీ.. బినామీ

- 'నకిలీ' సీడ్ నుంచి ఫీడ్, మందుల వరకు అన్నీ కల్తీనే
- కుదేలవుతున్న ఆక్వా రైతులు

బిట్రగుంట: ఆక్వా సాగుకు జిల్లా ఆయువు పట్టు. తీరంలో విస్తారంగా ఆక్వా సాగు చేస్తున్నారు. అయితే సీడ్ నుంచి ఫీడ్, ప్రోబయోటిక్స్ వరకు అన్ని నకిలీ, కల్తీలతో ఆక్వా రైతులను నట్టేటా ముంచుతున్నాయి. కావలి నియోజకవర్గంలోని బోగోలు, కావలి, అల్లూరు మండలాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో ఆక్వా సాగువుతోంది. రెండు దశాబ్దాల క్రితం ఆక్వా రంగాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిన టైగర్ రొయ్యల సాగును నకిలీలు పూర్తిగా కనుమరుగు చేసింది. ఆ తర్వాత వచ్చిన వెనామీ సాగు పెరిగే కొద్దీ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న సీడ్ హేచరీలు, ఫీడ్, మందుల సంస్థలు ఆకర్షణీయమైన పేర్లతో తయారు చేసి మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో ఇప్పటికే భారీ స్థాయిలో ఆక్వా సాగు జరుగుతోంది., ప్రతి ఏటా సాగు విస్తీర్ణం రెట్టింపవుతుండటంతో నకిలీ సంస్థలు ఈ ప్రాంతాలపైనే ప్రధానంగా దృష్టి సారించాయి. నెల్లూరు, కోవూరు పరిసర ప్రాంతాల్లో అద్దె భవనాలు ఏర్పాటు చేసుకున్న నకిలీ సంస్థలు ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల నుంచి ముడి సరుకులు తీసుకురావడం, గోడౌన్లలో అందమైన కవర్లు, డబ్బాల్లో ప్యాక్ చేసి రైతులకు అంటగడుతున్నాయి. గ్రోత్ పెరుగుదల కోసం, జీర్ణశక్తి మెరుగు పరిచేందుకు, బాక్టీరియా, అమోనియా లోడ్ కంట్రోల్, విటమిన్ సీ, మినరల్స్, మౌల్టింగ్ త్వరగా అయ్యేందుకు, ఆక్సిజన్ వినియోగం పెరిగేందుకు, హెల్త్ అండ్ వెయిట్ ఇంప్రూవ్‌మెంట్ సప్లిమెంట్స్, రొయ్య రంగు బాగుండేందుకు, రొయ్యల చెరువుల్లో నీళ్ల రంగు వచ్చేందుకు, మేత వినియోగం మెరుగు పరిచేందుకు అంటూ రకరకాల పేర్లతో మందులు అంటగడుతున్నారు. ఆక్వా ఫీడ్ తయారీలో పేరెన్నికగన్న సంస్థలు కూడా సీజన్‌ను, డిమాండ్‌ను బట్టి నాసిరకం మేతలు సరఫరా చేస్తున్నాయని ఆక్వా రైతులు వాపోతున్నారు.



తీరంలో సాగవుతున్న రొయ్యల గుంతలు



నకిలీ మందులు కారణంగా ఎదుగుదల లేక చనిపోతున్న రొయ్యలు

భారీగా అమ్మకాలు

తీరం వెంబడి ఆక్వా సాగు చేసే రైతుల కోసం ఆయా గ్రామాల్లోనే కొంచెం పెద్ద రైతులు, దళారులు మేత, మందులు విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేస్తారు. కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని సీడ్ దగ్గర నుంచి మేత, మందులు, జనరేటర్లు, డీజిల్ వరకు చిన్నరైతులకు అప్పుగా ఇస్తారు. పంట పట్టుబడికి వచ్చిన తర్వాత వీళ్లే రొయ్యలు విక్రయించి తమ బాకీ జమ చేసుకుని మిగిలిన సొమ్ము రైతులకు ఇస్తారు. ఈ దుకాణాలే నకిలీ సంస్థలకు వరంగా మారాయి. తమ ఉత్పత్తులను ఎమ్మార్పీ ధరల్లో 50 నుంచి 60 శాతం కమీషన్‌గా ఇస్తూ ఎందుకూ పనికి రాని మందులు రైతులకు అంటగడుతున్నాయి. రూ.వెయ్యి ధర కలిగిన మందును విక్రయిస్తే రూ.500 నుంచి రూ.600 వరకూ కమీషన్ రూపంలో చెల్లిస్తున్నారు. దీంతో నకిలీ మందులనే విషయం వ్యాపారులకు తెలిసినా కమీషన్‌కు కక్కుర్తిపడి చిన్న రైతులకు అంటగడుతున్నారు.

స్పందించని యంత్రాంగం

ఆక్వా రైతులకు అండగా నిలవాల్సిన కోస్టల్ ఆక్వా ఆథారిటీ, ఎంపెడా వంటి సంస్థలు నకిలీ మందుల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయి. నకిలీ సీడ్ విషయంలో అప్పుడప్పుడూ హడావుడి చేసే అధికారులు నకిలీ మందుల విషయంలో మాత్రం నోరు మెదపటం లేదు. వెనామీ సాగులో ఉన్న రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులే కావడంతో నకిలీ మందుల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. పైపెచ్చు నాణ్యత లేని సీడ్, వాతావరణ మార్పుల కారణంగా ఎదుగదల ఏ మాత్రం నెమ్మదించినా విపరీతంగా మందులు వాడుతున్నారు. చివరకు దుకాణాల్లో అప్పులు పెరిగి ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితికి చేరుకుంటున్నారు.

దేవాలయాలకు నిధుల మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ విజయ భాస్కర్‌రెడ్డి

చేజర్ల: మండలంలోని పలు దేవాలయాలకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. టీటీడీ ద్వారా ఒక్కొక్క దేవాలయానికి నిర్మాణానికి, మరమ్మతులకు రూ.10 లక్షలు చొప్పున 13 దేవాలయాలకు నిధులు మంజూరు చేయించారన్నారు. చేజర్ల దళితవాడ, అరుంధతీయవాడ, శివాలయం, గంగమ్మ గుడికి, పాడేరు, చిత్తలూరులో వీరభద్రస్వామి, చెన్నకేశవస్వామి, కొలపనాయుడుపల్లిలో రామాలయం, తిరుపతి నాయుడుపల్లిలో రామాలయం, యనమదల సీతాలమ్మ గుడి, బిల్లుపాడు అరుంధతీయవాడ మాతమ్మ గుడికి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. చేజర్ల చెన్నకేశవస్వామి ఆలయానికి మాచింగ్ గ్రాంట్ క్రింద రూ.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

నా భూమి.. నా దేశం



మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సంగం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నా భూమి.. నా దేశం కార్యక్రమాన్ని ఎంపీడీఓ గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డితో కలిసి కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. 13 సచివాలయాల పరిధిలోని మట్టిని సేకరించి ఆ మట్టిని కలశంలో ఉంచి ఢిల్లీకి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మూగజీవాన్ని కాపాడిన సీఐ



బురదలో చిక్కుకున్న దూడను బయటకు తీస్తున్న పోలీసు సిబ్బంది

ఉదయగిరి: ఉదయగిరి పెద్ద చెరువు నీటికుంటలో చిక్కుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న గేదె దూడను బుధవారం ఉదయగిరి సీఐ వి.గిరిబాబు తన సిబ్బందితో కాపాడేలా చర్యలు తీసుకున్నారు. చెరువు నీటికుంటలో ఓ గేదె దూడ బురదలో చిక్కుకొని బయటకు రాలేక ప్రాణాపాయ స్థితిలో ఇబ్బంది పడుతున్న విషయాన్ని పలువురు గమనించి సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి వెంటనే తన సిబ్బందితో నీటికుంటలో ఉన్న దూడను బయటకు తీసి కాపాడారు.

మతసామరస్యం.. భక్తి పారవశ్యం

మర్రిపాడు మండలం ఖాన్‌సాహెబ్‌పేటలో ఒకటిన్నర దశాబ్దం క్రితం కొలువైన అలీ ఔలియా దర్గా హిందూ, ముస్లిం మత సామరస్యానికి వేదికగా నిలుస్తోంది. జిల్లా నుంచే గాక మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు దర్గాను దర్శించి తరిస్తుండడంతో ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకుటోంది. ఈ దర్గా పీఠాధిపతిగా హిందువు, యాదవ సామాజిక వర్గానికి చెందిన ఓ యువకుడు ఉండడం ప్రత్యేకతగా చెప్పవచ్చు.

21 కిలోల బంగారు పీరు ప్రతిష్టకు సన్నాహం


- ఖాన్‌సాహెబ్‌పేటలో ప్రత్యేకతను సంతరించుకున్న అలీ ఔలియా దర్గా
- హిందువే.. దర్గా పీఠాధిపతి



21 కిలోల బంగాకు పీరు ప్రతిష్టించనున్న మహారాష్ట్ర భక్తులు నిర్మించిన కట్టడం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఖాన్‌సాహెబ్‌పేట గ్రామానికి చెందిన గోపిదేశి రామకృష్ణయ్య, దొరసానమ్మ దంపతులకు ఇద్దరు మగబిడ్డలు. వీరిలో ఒకరైన హజరత్తయ్య చిన్నతనంలో 2003వ సంవత్సరం నుంచి గ్రామంలోని ఓ వేప చెట్టు వేదికగా అల్లాను ఆరాధించేవాడు. ముస్లింలు పవిత్రంగా భావించే జెండాలు వేప చెట్టు వద్ద ఉంచి తనపై నమ్మకంతో వచ్చే భక్తులకు సపర్యలు చేసి స్వస్థత చేకూర్చేవాడు. ఈ క్రమంలో కొన్ని కారణాలు వల్ల డీసీపల్లి పంచాయతీ కురుకంద్రిక అనే పురాతన గ్రామం వద్ద కడప నవాబులు ప్రతి ఏటా ఉరుసు నిర్వహించే జెండా చెట్టు వద్ద తన కార్యకలాపాలు కొనసాగించాడు. నందవరానికి చెందిన కొందరు వ్యక్తులు అభ్యంతరం పెట్టడంతో తన స్వగ్రామం ఖాన్‌సాహెబ్‌పేటలో ఉన్న ఉమ్మడి కుటుంబీకుల స్థలంలోనే చిన్న రేకుల షెడ్డు ఏర్పాటు చేసి తన కార్యకలాపాలు కొనసాగించారు. హజరత్తయ్య వద్దకు వచ్చిన భక్తుల ద్వారా అతని మహిమలు ఆ నోటా, ఈ నోటా పడి జిల్లాలు దాటి సమీపంలోని రాష్ట్రాలకు సైతం విస్తరించాయి. పెద్ద కోటీశ్వరులు సైతం సూపర్ స్పెషాలిటి ఆస్పత్రుల్లో సైతం నయంకాని జబ్బులు హజరత్తయ్య నిర్వహించే దర్గా వద్ద పూజలు చేస్తే నయం అవుతున్నాయని బలంగా నమ్మారు. ఈ క్రమంలో తమ కోరికలు నెరవేరిన భక్తులు ప్రతి నెలలో ఇక్కడ గంధమహోత్సవాలు నిర్వహిస్తూ భక్తులకు విరివిగా అన్నదానాలు చేయసాగారు. దీంతో పాటు మహారాష్ట్రకు చెందిన ఓ భక్తుడు తన కుమార్తెకు మరణం తప్పదని డాక్టర్లు తేల్చి చెప్పిన ఒక జబ్బును ఖాన్‌సాహెబ్ దర్గా సందర్శన ద్వారా నయం కావడంతో 21 కిలోల బంగారు కిరీటం ప్రతిష్టిస్తానని మొక్కుకున్నారు. ఆ ప్రకారం పటిష్టమైన కట్టుబడితో ముస్లిం సంప్రదాయ పద్ధతుల్లో కట్టడం నిర్మించారు. ఈ నెల 13 నుంచి ఇతర పనులు పూర్తి చేసి త్వరలోనే అక్కడ బంగారు కిరీటం ప్రతిష్టించేందుకు ముమ్మర సన్నాహాల్లో ఉన్నారు.

హజరత్తయ్య.. ప్రస్తుతం బందా నవాజ్ బాబా



దర్గా పీఠాధిపతి గోపిదేశి హజరత్తయ్య ఉరఫ్ బందా నవాజ్ బాబా

యుక్త వయసులో గోపిదేశి హజరత్తయ్యగా అల్లా సేవలో తరించడంతో పాటు దేశంలోని ప్రముఖ దర్గాలను పాదయాత్రల ద్వారా దర్శించిన వ్యక్తి బందా నవాజ్‌బాబా పేరుతో అలి ఔలియా దర్గా పీఠాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భక్తుల సహకారంతో అజ్మీర్, నాగూర్, పెనుగొండ, కలేరు, నాగపూర్, గుల్బర్గా, కసుమూరు, రహమతాబాద్ తదితర దేశంలోని 12 ప్రముఖ దర్గాలకు పోలిన నమూనా దర్గాలను ఖాన్‌సాహెబ్‌పేటలో నిర్మించాడు. ప్రతి నెలా భక్తులు వందలు, వేలుగా దర్గా వద్దకు వచ్చి ప్రార్థనలుగా చేసి తమ కోర్కెలు నెరవేరాయంటూ చేతనైన విరాళాలు సమకూరుస్తూ ఖాన్‌సాహెబ్‌పేటలో ఆధ్యాత్మిక పరిమళాలను పెంచి పోషిస్తున్నారు. దర్గాలకు వచ్చే భక్తుల్లో ముస్లింల కంటే హిందూవులే అత్యధికంగా ఉండడం గమనార్హం. మారుమూల గ్రామమైన ఖాన్‌సాహెబ్‌పేటలో దర్గా పురోభివృద్ధి కారణంగా పరిసర గ్రామాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని స్థానికులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల్లో అత్యధికులు ఆర్థికంగా ఉన్నతులు కావడం ఒక ఎత్తైతే, డాక్టర్లు, ఇంజినీర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు సైతం ఉండడం మరింత ప్రత్యేకత చేకూరిందని చెప్పవచ్చు. ఇటీవల ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సైతం దర్గాను సందర్శించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తన వంతుగా దర్గా పురోభివృద్ధికి చేతనైన సాయం చేస్తానని హామీ ఇచ్చారు.



పీర్లచావిడిలా వినియోగించే మకాన్



ఖాన్‌సాహెబ్‌పేట అలి ఔలియా దర్గాలో ప్రస్తుతం పూజలు అందుకుంటున్న పీర్లు